ధాన్యం దోపిడీని ప్రశ్నించిన రైతుపై కేసు

కక్ష సాధింపు చర్యలకు దిగుతున్న కాంగ్రెస్ సర్కారు • ఎమ్మెల్యే ఒత్తిడి మేరకే కేసు నమోదు?

నిర్మల్, మే 15(నమస్తే తెలంగాణ) : ధాన్యం తూకంలో దోపిడీని ప్రశ్నించిన రైతులపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన నిర్మల్ జిల్లాలో గురువారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిర్వాహకులు క్వింటాలుకు 8 కిలోల చొప్పున వడ్లను అదనంగా తూకం వేయడంతో ఇదేం దోపిడీ అంటూ మంగళవారం రైతులంతా కలిసి ఆందోళనకు దిగారు. పీఏసీఎస్ కార్యదర్శి ఆశన్న రైతులను సముదాయించే ప్రయత్నం చేయగా సమీపంలోని పాఠశాల గదిలో బంధించి తూకంలో మోసంపై నిలదీశారు. దీంతో ఆయన తన తప్పును ఒప్పుకొని రైతులకు లిఖిత పూర్వకంగా లెటర్ రాసి ఇచ్చి, అదనంగా ధాన్యం తీసుకోమని హామీ ఇచ్చారు. బుధవారం ఖానాపూర్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం సందర్భంగా అక్కడే ఉన్న పోలీసు అధికారులను ఎమ్మెల్యే పిలిచి సొసైటీ అధికారులను నిర్బంధిస్తుంటే ఏమి చేస్తున్నారని నిలదీశారు. దీంతో పోలీసులు పీఏసీఎస్ అధికారుల నుంచి ఫిర్యాదు స్వీకరించి కడారి గోపాల్‌పై కేసు నమోదుచేశారు. గురువారం పోలీసులు గోపాల్ ఇంటికి వెళ్లి పోలీస్ స్టేషన్‌కు రావాలంటూ తెలుపగా అరెస్టు వారెంటు చూపాలని కోరడంతో తిరిగి వెళ్లిపోయారు.

దోపిడీని ప్రశ్నిస్తే కేసులా? : రైతు గోపాల్

కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తరుగు పేరిట క్వింటాలుకు 8 కిలోలు అదనంగా తీసుకోవడంతో వడ్లను తూకం వేయడాన్ని నిలిపివేయించినం. రైతుల కష్టాన్ని ఎందుకు దోచుకుంటున్నారని కార్యదర్శి ఆశన్నను నిలదీయగా సొసైటీ చైర్మన్ ఆదేశాలతోనే తూకం వేస్తున్నామని చెప్పారు. రైతులు ఆందోళన చేయడంతో బస్తాకు 42 కిలోల తూకం వేస్తామని కార్యదర్శి లెటర్ రాసి ఇచ్చిండు. గురువారం ఇద్దరు కానిస్టేబుళ్లు ఇంటికి వచ్చి పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించారు. అదనంగా వడ్లు తూకంవేసి రైతులను మోసం చేస్తున్నారని సొసైటీ సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, రైతులపైనే ఉల్టా కేసులు పెట్టడం బాధాకరం.

ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో రైతు గోపాల్‌ను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీస్

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో హైవే-167పై రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కోసం ధర్నా

జడ్చర్లలో రైతుల ఆందోళన

జడ్చర్ల, మే 15 : ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్డెక్కారు. ధాన్యం అమ్ముకునేందుకు 15 రోజులుగా జాగరణ చేయాల్సి వస్తున్నదని ఆగ్రహం చెందిన రైతులు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల హైవే-167పై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి సకాలంలో ధాన్యం తీసుకురాగా చెత్త, తేమ పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.తడిచిన ధాన్యాన్ని నిత్యం ఆరబెట్టాల్సి వస్తుందన్నారు. మిల్లులకు తీసుకెళ్తే తరుగు పేరుతో దగా చేస్తున్నారని వాపోయారు. రాస్తారోకోతో వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో ఎస్సై జయప్రసాద్ వచ్చి రైతులతో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి కొనుగోలు చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

పంట విక్రయానికి పడిగాపులు

ఆదిలాబాద్ జిల్లాలో జొన్న రైతుల అవస్థలు

ఆదిలాబాద్, మే 15(నమస్తే తెలంగాణ) : జొన్న రైతులు పంటను విక్రయించడానికి పడిగాపులు కాస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 12 మార్కెట్లలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా జొన్నలను మద్దతు ధర క్వింటాలుకు రూ.3371తో సేకరిస్తున్నది. 20 రోజుల కిందట జిల్లాలో జొన్నల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.2500తో కొనుగోలు చేస్తుండడంతో రైతులు మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో పంటను విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పంట కొనుగోళ్లలో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఫలితంగా తాము ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు తెలిపారు. పంట కొనుగోళ్లలో జాప్యం ఫలితంగా జొన్నలను దొంగలు ఎత్తుకుపోతున్నారు. యార్డులో భద్రత లేకపోవడంతో దొంగలు పేట్రేగిపోతున్నారు. పంట ఉత్పత్తులను ఎత్తుకెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన రైతులపై దాడులకు పాల్పడుతున్నారు.

పంటను కొనుగోలు చేయాలని అధికారిని వేడుకుంటున్న రైతులు

మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నా..

30 క్వింటాళ్ల జొన్నలను అమ్మడానికి ఆదిలాబాద్ మార్కెట్‌యార్డుకు తెచ్చాను. మూడ్రోజులు అవుతున్నా పంటను తీసుకోవడంలేదు. లారీలు వస్తలేవని, సంచులు ఖాళీ కావడం లేదని సిబ్బంది అంటున్నారు. షెడ్డులో బుధవారం రాత్రి పంటకు కాపలాగా నిద్రిస్తుండగా ముగ్గురు దొంగలు వచ్చారు. రెండు గోనె సంచుల్లో జొన్నలను నింపుకుంటుండగా అడ్డుకోగా నాపై కట్టెలతో దాడి చేశారు. తలకు గాయాలై మూడు కుట్లుపడ్డాయి.

– నారాయణ, రైతు, బరంపూర్, తలమడుగు, ఆదిలాబాద్.

ఆదిలాబాద్ మార్కెట్‌లో దొంగల దాడిలో గాయపడిన రైతు నారాయణ

దాడిలో గాయపడిన రైతు దిలీప్‌రెడ్డి

రైతులపై దొంగల దాడి

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఘటన

ఆదిలాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతులపై దొంగలు దాడిచేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. రైతులు పంటను తీసుకొచ్చి మూడ్రోజులుగా మార్కెట్‌లో కాపలాగా నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి సమీపకాలనీకి చెందిన కొందరు మార్కెట్ యార్డుకు వచ్చి జొన్నలను సంచుల్లో నింపుకుని దొంగలిస్తుండగా రైతులు వారిని పట్టుకునే ప్రయత్నంచేశారు. దీంతో వారు రైతులపై రాళ్లు, కట్టెలతో దాడిచేశారు. ఈ దాడిలో సాత్నాల మండలం రాంపూర్‌కు చెందిన దిలీప్‌రెడ్డి, తలమడుగు మండలం బరంపూర్‌కు చెందిన నారాయణకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మార్కెట్ యార్డుకు చేరుకుని గాయపడిన రైతులను దవాఖానకు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న ప్రాథమిక సహకార సంఘాల సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా అమ్మకాల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని, ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- సాగు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల అప్పు
- తీర్చే మార్గంలేక బలవన్మరణం
- మెదక్ జిల్లా శాలిపేటలో ఘటన

చిన్నశంకరంపేట,మే15: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శాలిపేటలో గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. శాలిపేటకు చెందిన మాలే సత్యనారాయణ(40) ఏడాదిన్నర క్రితం వ్యవసాయంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల అప్పుచేశాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడం, అప్పులోళ్ల వేధింపులతో మనోవేదనకు గురైన సత్యనారాయణ గురువారం తన వ్యవసాయం భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూసేకరణ పూర్తయిన ప్రాజెక్టులకే నిధులు

మొదటిపేజీ తరువాయి...

తీసుకెళ్లారు. స్పందించిన రేవంత్ రెడ్డి భూసేకరణ పూర్తయిన ప్రాజెక్టుల పనుల పూర్తికే నిధులు మంజూరు చేస్తామని, కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుకు అది వర్తిస్తుందని చెప్పినట్టు తెలిసింది. భూసేకరణ పూర్తికి ప్రాధాన్యమివ్వాలని, అవసరమైతే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించినట్టు సమాచారం.

వాట్సాప్ ఆదేశాలు ఎలా చెల్లుబాటు అవుతాయి?

ఫార్మా వ్యతిరేక కమిటీ సమన్వయకర్త సరస్వతి

యాచారం, మే15: ఫార్మా భూముల్లో పంటలు సాగు చేయొద్దని వాట్సాప్ మెసేజ్ ద్వారా ఆదేశాలిస్తే ఎలా చెల్లుబాటు అవుతాయని ఫార్మా వ్యతిరేక పోరాటకమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి ప్రశ్నించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు ఫార్మాసిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో పంటలు సాగు చేయొద్దని మండల వ్యవసాయ అధికారి వాట్సాప్ మెసేజ్‌ను స్థానిక గ్రూపులలో పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్ సంతకం చేసి ప్రభుత్వ స్టాంపువేస్తేనే చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఉండగానే అధికారులు సర్వే చేయడం, ఫెన్సింగ్ పనులు చేపట్టడం సరికాదని చెప్పారు. ఫార్మా రైతుల సమస్యలు పరిష్కరించేవరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు.

సంగారెడ్డి జిల్లా చక్రియాల్‌లో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డి

ధాన్యం వర్షార్పణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతుల ఇక్కట్లు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 15 ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం కురిసిన వర్షంతో ధాన్యం తడిసి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఆరబోసిన, బస్తాల్లో ఉంచిన ధాన్యం సైతం తడిసిపోయింది. బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం కొండాపూర్ మండలంలో పర్యటించి తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను పరిశీలించారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చౌటకూరు మండలంలో తడిసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లాలో సరాసరి 2.9 సెం.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదైంది. అల్మాయిపేటలో 20 నుంచి 30 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. నేరేడిగుంట కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యంతోపాటు మిల్లుకు తరలించే ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. చింతకుంట కొనుగోలు కేంద్రం వద్ద 20 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. అందోలు పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద 30 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. చౌటకూరు మండలం కోర్పొల్ కొనుగోలు కేంద్రంలో 800 ధాన్యం బస్తాలు, చౌటకూరులో 1600, చక్రియాల్‌లో 400, గంగోజిపేట 250 బస్తాల ధాన్యం తడిసిపోయింది. తాడ్‌దాన్‌పల్లి, బద్రిగూడెం, ఉప్పరిగూడెంలో 200 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయినట్టు రైతులు తెలిపారు. పుల్కల్ మండలం పుల్కల్, గొంగ్లూరు గ్రామాల్లో 1200 క్వింటాళ్ల వరకు ధాన్యం తడిచిపోయింది. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కల్పగూరు గ్రామాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. కంది కొనుగోలు కేంద్రంలో మిల్లులకు తరలించాల్సిన ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. సదాశివపేట మండలం కొల్లూరులో 20 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది. కొండాపూర్ మండలం సీహెచ్ కొనాపూర్‌లో మొక్కజొన్న పంట వర్షానికి తడిసిపోయింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్, ముట్రాజ్‌పల్లిలో వర్షానికి ధాన్యం తడిసిపోయి రైతులు ఇబ్బందిపడ్డారు. మెదక్ జిల్లా కొల్చారం, చిలిపిచెడ్, మెదక్, పాపన్నపేట మండలాల్లో అకాల వర్షం కురిసి ధాన్యం తడిసింది.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య

- వేతనం సమయానికి అందకపోవడంతో మనస్తాపం

హైదరాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని గోవర్ధన్ అనే హోంగార్డు(డ్రైవర్) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమలగిరి డివిజన్ ఫోర్స్ మొబైల్ డ్రైవర్‌గా పని చేస్తున్న గోవర్ధన్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్తాపంతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే గోవర్ధన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కూతురికి వైద్యం చేయిస్తున్నాడు. జీతం సమయానికి రాక, కూతురుకు వైద్యం చేయించలేక అవస్థలు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా గోవర్ధన్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న నెరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జీతమే రావట్లేదు..

అధికారంలోకి వస్తే హోంగార్డుల ఉద్యోగాలు క్రమబద్ధీకరిస్తామని నాటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని హోంగార్డులు గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే జీతాలే టైమ్‌కు రావడంలేదని, క్రమబద్ధీకరణ ఎప్పుడు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతినెలా 1వ తేదీన జీతాలు వచ్చేవని, పిల్లాపాపలతో ఆనందంగా ఉండేవాళ్లమని చెప్తున్నారు. ఆఖరికి బందోబస్తు విధులకు హాజరైన హోంగార్డుల అలవెన్స్‌లు, డైట్ చార్జీలను కూడా కట్ చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గోవర్ధన్ ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని చెప్తున్నారు.

- వర్షాలకు తడిసి మొలకెత్తుతున్న వడ్లు

అకాల వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా నిర్వాహకులు ఏర్పాట్లుచేయకపోవడంతో వడ్లు తడిసిపోతున్నాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరసగా కురుస్తున్న వర్షాలకు ఓ రైతు తీసుకొచ్చిన వడ్లు మొలకెత్తగా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. – ఏటూరునాగారం

భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నిరసన

- నాడు పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీని అమలు చేయాలి
- నందారం రెవెన్యూ సదస్సును అడ్డుకున్న గ్రామస్తులు

అక్కన్నపేట, మే 15: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నందారంలో భూభారతి చట్టంపై గురువారం రెవెన్యూ అధికారులు నిర్వహించిన అవగాహన సదస్సును రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నందారం, కపూర్‌నాయక్‌తండాలో మొత్తం 1,456 ఎకరాలు ఉండగా, 932 ఎకరాలు సీలింగ్ భూమిగా రికార్డుల్లో నమోదైందని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సీలింగ్ భూసమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేటికీ సమస్య పరిష్కారానికి నోచలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ఓఎస్‌డీ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని తహసీల్దార్ సురేఖ, రైతులతో మాట్లాడారు. నందారం సీలింగ్ భూముల విషయం మంత్రి పొన్నం దృష్టిలో ఉందని, ఇందుకోసమే అక్కనపేటను పైలట్ మండలంగా ఎంపిక చేసినట్టు చెప్పారు. రైతులు తమకు భూమి హక్కు కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

భూ భారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అక్కన్నపేట రైతులు

రైతులకు పరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు

మంత్రి సీతక్క

ములుగు, మే15 (నమస్తే తెలంగాణ): రైతులకు నష్టపరిహారం చెల్లించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ డైరెక్టరేట్ కార్యాలయంలో విత్తన కంపెనీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించగా విత్తన కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు

ఏటూరునాగారం, మే 15 : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఊరవాగు ఒడ్డున ఏర్పాటు చేయడంపై ముగ్గురు అధికారులకు అదనపు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. బుధవారం ఊర వాగు ఉప్పొంగడంతో ఇక్కడి కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యం కొంత కొట్టుకుపోగా, కొంత తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. లోతట్టు ప్రాంతంలో కొనుగోలు కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కో ఆపరేటివ్ అధికారి, సివిల్ సప్లయ్ డీటీ, పీఏసీఎస్ సీఈవోకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. సంబంధిత ఉన్నతాధికారిని వివరణ కోరగా గోగుపల్లి ఘటనపై నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

డ్రైవర్‌లెస్ కార్లదే భవిష్యత్తు!

- 2035 నాటికి రోడ్లపై వాటిదే ఆధిపత్యం
- టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ ఎల్లుస్వామి

న్యూఢిల్లీ: భవిష్యత్తు అంతా డ్రైవర్‌లెస్ కార్లదేనని టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌ఎల్లుస్వామి వెల్లడించారు. తాజాగా ఆయన ఓ యూట్యూబ్ చానల్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. భారత సంతతికి చెందిన ఆయన విద్యుత్తు కార్ల తయారీ, ఎలాన్ మస్క్‌తో తన కున్న అనుబంధాన్ని పంచుకున్నారు. 2035 నాటికి రోడ్లపై డ్రైవర్‌లెస్ కార్లదే ఆధిపత్యమని పేర్కొన్నారు. ఇక నడిపే కారు కావాలంటే పాతవే వాడాల్సి ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. అమెరికాలోని అన్ని నగరాల్లో ఇకపై డ్రైవర్‌లెస్ కార్లను అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఇవి ఏఐ ఆధారితంగా పనిచేస్తాయని వెల్లడించారు. ఇక టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పనితీరుపై స్పందిస్తూ రిస్క్ తీసుకోవడానికి ఆయన ఎన్నడూ వెనుకడుగు వేయరని తెలిపారు. వారానికి 80-90 గంటలు ఆయన పనిలోనే ఉంటారని పేర్కొన్నారు. ఆయన పనితీరే సంస్థ ఉన్నతికి కారణమని పునరుద్ఘాటించారు. ఇక టెస్లా ఆటో పైలెట్ బృందంలో మొదటగా చేరిన వ్యక్తిగా అశోక్ ఎల్లుస్వామి నిలిచారు. కృత్రిమమేధతో టెస్లా సాధించిన విజయంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

రైతులపై కాంగ్రెస్ నేత దౌర్జన్యం

- ఆందోళన ఎందుకు చేస్తున్నారంటూ దుర్భాష
- రైతుల ఆగ్రహం.. నాయకుడికి దేహశుద్ధి
- పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో ఘటన

పెద్దపల్లి రూరల్, మే 15: కొనుగోలు కేంద్రంలో ధర్నా చేస్తున్న రైతులపై ఓ కాంగ్రెస్ నేత దౌర్జన్యం చేసి, దుర్భాషలాడిన ఘటన పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలోని కొనుగోలు కేంద్రంలో సన్న వడ్ల కొనుగోలులో జాప్యంపై రైతులు గురువారం సాయంత్రం పెద్దపల్లి-జూలపల్లి రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ క్రమంలోనే పెద్దపల్లి నుంచి సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి వైపు వెళ్తున్న ఆ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ చైర్మన్ అట్ల కుమార్ వీరిని చూసి ఆగ్రహానికిలోనయ్యారు. 'మీరెందుకు ధర్నా చేస్తున్నారు. మీకేం హక్కు ఉందంటూ' దుర్భాషలాడటంతో రైతులు కోపోద్రిక్తులయ్యారు. సదరు కాంగ్రెస్‌నేతపై దాడికి పాల్పడడంతో కొనుగోలు కేంద్రం వద్ద గందరగోళ పరిస్థితి నెలకొంది. పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ ఆదేశాలమేరకు పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను శాంతింపజేశారు. ఘర్షణలో నిమ్మనపల్లికి చెందిన రైతు ఆకుల సంపత్ చొక్కా చిరిగిపోయి, గాయాలయ్యాయి. పోలీసులు అతడిని పెద్దపల్లికి తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో 15 రోజులుగా సన్న వడ్లకు అలాట్‌మెంట్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్లు కొనాలని సీఈవో చెప్పినా ఇక్కడి నిర్వాహకులు లంచాల మత్తులో ఇష్టం వచ్చిన వారివే కాంటాలు వేస్తున్నారని ఆరోపించారు.

పెద్దపల్లి మండలం నిమ్మనపల్లిలో సన్న వడ్లు కొనాలని ఆందోళన చేస్తున్న రైతులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడుతున్న కాంగ్రెస్ నేత అట్ల కుమార్ (కాఫీ కలర్ చొక్కా వ్యక్తి)

బెంగాల్‌లో 'తీస్తా ప్రహార్' సైనిక విన్యాసాల ప్రదర్శన

కోల్‌కతా, మే 15 : పశ్చిమ బెంగాల్‌లోని తీస్తా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో భారత్ భారీ ఎత్తున సైనిక విన్యాసాలు నిర్వహించింది. 'తీస్తా ప్రహార్' పేరుతో నిర్వహించిన ఈ విన్యాసంలో నదీ తీర ప్రాంతంలో యుద్ధం సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలి, శత్రువు వ్యూహాలను ఎలా భగ్నం చేయాలన్న దానిపై కసరత్తు చేసింది. సైనికుల సమన్వయం, ఆయుధ సరఫరా తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరీక్షించింది. ఇటీవల భారత సైన్యంలోకి చేరిన అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ, ఆయుధాలు ఎలా వినియోగించాలి, తద్వారా ఎదురయ్యే సాంకేతిక సమస్యలను ఎలా అధిగమించాలో ఇందులో ప్రదర్శించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సమర్థంగా, వేగంగా ఎలా ప్రతిస్పందించాలో, లక్ష్యాలను ఛేదించాలో రిహార్సల్స్ చేశారు. దీనికి సంబంధించి భారత ఆర్మీ ఒక వీడియోను విడుదల చేసింది.